ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 26 ఫిబ్రవరి 2024




నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం 8లో..

8లో.. ప్రమాదకరంగా రోడ్లు, కల్వర్టులు - పట్టించుకోని అధికారులు

మంథని ఐసీడీఎస్‌లో అక్రమాలు

- విధులకు హాజరు కానీ సూపర్‌వైజర్‌కు వేతనం
- సీడీపీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- విచారణ చేపట్టిన డీడబ్ల్యూవో





(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/మంథని)

మంథని సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్టు సీడీపీఓ అవినీతికి పాల్పడుతున్నట్లుగా అదే శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఈ నెల 13న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ జిల్లా


Department for Women Development & Child Welfare
Government of Telangana

Monthly Activity Report - m Anganwadi

Date: 03/02/2024

Report for the Month/Period of	From: 01/01/2024	To: 31/01/2024	
Designation:	Supervisor		
Name of the Officer:	Rendla Swarupa		
District:	PEDDAPALLI		
Project (If CDPO/ACDPO):	MANTHANI		
Sector (If Supervisor):			

Day wise activities

Date	Activity type	Description

Monthly Abstract

No. of Working Days:	24			No. of Days Attended/Reported:		0	
AWC Visits	Institutions Visited	Meetings Attended	Office Work	Court Cases	Trainings Attended	Other Works	Leaves
0	0	0	0	0	0	0	0

Signature

Name & Designation of the Officer

జనవరి నెలలో హాజరు కానట్లుగా ఉన్న అంగన్‌వాడీ ఎం యాప్

సంక్షేమ అధికారిని విచారణకు ఆదేశించారు. 2022 అక్టోబర్‌లో సూపర్‌వైజర్ పోస్టుల కోసం నిర్వహించిన రాత పరీక్ష ద్వారా ఎంపికైన సూపర్‌వైజర్లలో నలుగురు మంథని ప్రాజెక్టులో పోస్టింగ్ ఇచ్చారు. వారికి మొదటి వేతనం చేయడానికి సీడీపీవో ఒక్కొక్కరి నుంచి 15 వేల రూపాయల చొప్పున తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నలుగురి సూపర్‌వైజర్లలో మంథని ప్రాజెక్టులో 15 సంవత్సరాల పాటు టీచర్‌గా పని చేసిన స్వరూప ఒకరు. ఆమె సీడీపీఓకు సన్నిహితంగా ఉంటారని, ఆమె ఎప్పుడు అనారోగ్యంతో బాధపడే వారని, ఆమె విధులకు హాజరు కాకపోయినా సీడీపీవో ఆమె వద్ద నెలకు 2 వేల రూపాయలు తీసుకుని పూర్తి వేతనం చెల్లించే వారని వివరించారు.

స్వరూప పని చేసే సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాల లోపాలు, తప్పులు, హాజరును తెలుసుకునేందుకు సీడీపీఓ స్వరూపను పావుగా వాడుకున్నారని పేర్కొన్నారు. స్వరూప సూపర్‌వైజర్‌గా ఎంపికైన తర్వాత సీడీపీవో ఆమెతో ఒక రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం. ఆమె ప్రతి నెలా సగం రోజులు, అంతకంటే తక్కువ రోజులు హాజరైనా కూడా పూర్తి స్థాయి వేతనం చెల్లిస్తానని, అందులో సగం వేతనం తనకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఆమె నెలంతా హాజరైనా కాకున్నా, పూర్తి స్థాయిలో వేతనం చెల్లిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

● జనవరి నెలలో..

కాగా ఈ ఏడాది జనవరిలో ఒక్క రోజు కూడా స్వరూప విధులకు హాజరు కాలేదని, అంగన్‌వాడీ ఎం యాప్‌లోనూ ఆ నెలలో ఆమె అక్టివిటీ ఏమి లేనట్లు ఉందని, ఆ ప్రతులను కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో తెలిపారు. గత ఆరు, ఏడేళ్లుగా మంథని ప్రాజెక్టులోనే పని చేస్తున్న సీడీపీవో కొందరు సూపర్ వైజర్లను తనకు అనుకూలంగా మార్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు విధులకు హాజరైనా, కాకున్నా తనకు ఇచ్చేవి ఇస్తే, ఎలాంటి చర్యలు ఉండవని, ఆమె ప్రోద్బలంతో కొందరు సూపర్‌వైజర్లు కింది స్థాయి వారిని వేధింపులకు గురి చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. వేతనాలు, ఇతరత్రా బిల్లులు చేసినా డబ్బులు తీసుకోనిదే పని చేయదనే ఆరోపణలున్నాయి. సీడీపీవో ఈ నెల 3వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు సెలవు పెట్టారని, ఆమె స్థానంలో సీనియర్ సూపర్‌వైజర్‌కు గా కుండా జూనియర్ సూపర్‌వైజర్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారని తెలుస్తున్నది. అలాగే సీడీపీవో కోసం అద్దెకు నడుస్తున్న కారును కార్యాలయంలో అందుబాటులో ఉంచాలి. కానీ వాహనం అందుబాటులో లేదని తెలుస్తున్నది.

● ఒకే చోట సుదీర్ఘ కాలంగా..

ఒకే చోట సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న సీడీపీవో వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె తీరుపై కలెక్టర్‌కు అదే శాఖలో పని చేసే ఉద్యోగులే ఫిర్యాదు చేయడం కలకలం రేపుతున్నది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖాధికారి రవూఫ్ ఖాన్ విచారణ చేపట్టారు. అయితే సీడీపీవోకు అనుకూలంగా విచారణ జరుపుతున్నా రని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది ఎవరు అని ఆరా తీస్తున్నారని, జనవరిలో స్వరూప విధులకు హాజరు కాకపోయినా హాజరైనట్లుగా హాజరు పట్టికలో సంతకాలు పెట్టించారని, కార్యాలయంలో పని చేసే ఒక ఉద్యోగి ద్వారా అంగన్‌వాడీ ఎం యాప్‌లో ఏ రోజు ఏఏ ఎలాంటి విధులు నిర్వహించిందనే విషయమై నమోదు చేయించారని ప్రచారం జరుగుతున్నది. అయితే కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుతో హాజరు పట్టిక ప్రతి, అంగన్‌వాడీ ఎం యాప్ ప్రతిలో మాత్రం సంతకాలు లేవు. అక్టివిటీ రిపోర్టు జీరో అని చూపిస్తున్నది. సీడీపీవో వ్యవహారంపై ఒక్క జిల్లా కలెక్టర్‌కే గాకుండా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర స్థాయి బృందం కూడా విచారణకు ఇక్కడికి వస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా సంక్షేమ శాఖాధికారి రవూఫ్ ఖాన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించానని తెలిపారు. ఈ వ్యవహారంలో తాను ఎవరికి అ నుకూలంగా వ్యవహరించలేదని, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఇసుక తరలిపోకుండా చూడాలి

- ఎమ్మెల్యే విజయ రమణారావు


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

ఓదెల, ఫిబ్రవరి 25: మానేరు నుంచి ఇసుక తరలిపోకుండా ప్రజలు కాపాడుకోవాలని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. మండలంలోని కేశవపూర్ రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. గత డిసెంబరుతో ఇసుక టెండర్ల గడువు ముగిసిందని, మళ్లీ మానేరు వాగు నుంచి ఇసుక తవ్వకాలు ఉండవని చెప్పారు. ఒకవేళ ఉంటే అడ్డుకోని కాపాడుకునే బాధ్యత గ్రామాల ప్రజలదేనని అన్నారు. త్వరలోనే రూ.25 లక్షల వ్యయంతో నిర్మించేందుకు అంతర్గత రోడ్లను మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే బ్రిడ్జిని కూడ మంజూరు చేస్తానన్నారు. రకరకాల కారణాలతో కొందరు కాంట్రాక్టర్లు ఇసుక కోసం వస్తున్నారని, మానేరు వాగు నుంచి ఇసుకను తీసుకెళితే అడ్డుకొని తగినబుద్ధి చెప్పాలన్నారు. అలాగే కొత్తగా మళ్లీ రైతులు ఇసుక నిల్వల కోసం భూములు ఇవ్వకూడదని గతంలో డంపు చేసుకున్న ఇసుకను మాత్రమే సంబంధించిన కాంట్రాక్టర్లు తీసుకెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుప్పాల శంకర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పిట్టల రవికుమార్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, చొప్పరి రాజన్న, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవి గౌడ్, అలాగే మచ్చ నర్సింగం, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, కిషోర్, ఎండి రఫి, తాళ్లపల్లి శ్రీనివాస్, పెద్దిరెడ్డి రఘుపతి రెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ

ధర్మారం, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యానారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం బీజేపీ చేపట్టిన సంకల్ప యాత్ర ధర్మారంకు చేరుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ యాత్రలో జాతీయ ఎస్సీ మోర్చ కార్యదర్శి ఎస్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి,జాడి బాల్‌రెడ్డి, మండల నాయకులు మేడవేని శ్రీనివాస్, నందినేని లక్ష్మణ్, ఎల్లాల మహేందర్‌రెడ్డి,గోనే సాయి తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ చేపట్టిన సంకల్పయాత్రలో ధర్మారం మండలం లోని పలు గ్రామాల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కమ్మరీఖాన్‌పేట, మల్లాపూర్, బంజేరుపల్లి, కటికెనపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల మీదుగా ర్యాలీ కొనసాగింది.

నేడు అవిశ్వాసంపై విచారణ

ఓదెల, ఫిబ్రవరి 25: మండలంలోని పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి పై పెట్టిన అవి శ్వాస తీర్మానంపై సోమవారం విచారణ నిర్వహించను న్నారు. ఫిబ్రవరి 7న పదిమంది డైరెక్టర్లు చైర్మన్, వైస్ చైర్మన్ల పై అవిశ్వాస తీర్మానాలను జిల్లా అధికారికి సమర్పించారు. ఈ మేరకు వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఉదయం 11.30 గం,కు జిల్లా అధికారి హాజరై విచారణ చేపట్టనున్నారు. ఉన్నతాధికారి ఆదేశించిన సమయానికి డైరెక్టర్లు హాజరు కాలేదు. కాగా చైర్మన్‌గా మళ్లీ శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతున్నారు.

విశ్వకర్మ యోజనలో గాండ్ల తెలికులను చేర్చాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన పథకంలో గాండ్ల తెలికులను చేర్చాలని గాండ్ల తెలికుల దేవ తెలికుల యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు లెక్కల నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కం రమాదేవి కోరారు. ఈ మేరకు పెద్దపల్లి పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి పురుషోత్తం రుపాలాకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గాండ్ల కులస్థులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించాలని వివరించారు. తమ సమస్యలను పరిష్కరించేలా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పొన్నూరు స్వప్న, జక్కం స్వరూప, వెన్నంపల్లి శరత్, జక్కం మహేష్, జక్కం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

పెద్దపల్లి రూరల్ , ఫిబ్రవరి 25 : కార్యకర్తలు ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు , భారతీయ జనతాపార్టీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ జండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునిల్‌రెడ్డి, మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్, మండల జనరల్ సెక్రటరి వేల్పుల సత్యం, వేల్పుల రమేష్, బూత్ అధ్యక్షులు లక్ష్మణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

జూలపల్లి: వెంకట్రావుపల్లి, కాచాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో బీజేపీ విజయసంకల్పయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, రావుల రామనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, నాయకులు గుమ్మడి శ్రీనివాస్, చిలుక తిరుపతి, మెండె రాజన్న, గుమ్మడి శంకరయ్య, భూసారపు రవిందర్‌గౌడ్, తాని అశోక్, పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు

ఓదెల, ఫిబ్రవరి 25: భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లిన భక్తులంతా స్వామివారిని దర్శించుకుంటున్నారు. బోనాలు, పట్నాలు, బంగారు పోచమ్మ, మదన పోచమ్మకు మొక్కులను సమర్పించారు.

బలమైన ఆర్థిక శక్తిగా భారత్

- బీజేపీ పాలనలో అన్నిరంగాల్లో అద్భుత పురోగతి - అవినీతి అంతమే మోదీ లక్ష్యం - కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా


విజయ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రూపాలా

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 25: ప్రధాని మోదీ పాలనలో ప్రపంచంలోనే భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని కేంద్ర ఎరువులు, కర్మాగారాల శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం పెద్దపల్లికి చేరుకున్న యాత్రను ఉద్దేశించి జండా చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ వారసత్వపాలన కారణంగా అంతులేని అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. అందువల్లే దేశం వెనుకబాటుకు గురైందని చెప్పారు. వారసత్వ రాజకీయాలను మోదీ ఒంటరిగా ఎదుర్కొంటున్నారని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీ వారసత్వ రాజకీయాలను అంతం చేసే దిశగా విజయం మోదీ నిర్ణయాలు ఉండబోతాయని తెలిపారు. శాస్త్ర విజ్ఞాన రంగాల్లో దేశం దూసుకుపోతుందని, చందమామ మీద పరిశోధనలు చేసే స్థాయికి మన శాస్త్రజ్ఞులు చేరుకున్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్న బీజేపీకి మరోసారి ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల పేరుతో దగా చేస్తున్న కాంగ్రెస్ తెలంగాణా ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా మోసం చేసిందని చెప్పారు. ఆచరణ సాధ్యంకాని ఆరు గ్యారెంటీల పేరు చెప్పి ఎన్నికల్లో గెలుపొందిందని రూపాలా దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెడతామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాముల పార్టీగా అభివర్ణించిన ఆయన, ఒక ఎంపి ఇంట్లో లెక్కలు తేలని 3 కోట్ల రూపాయలు నగదు దొరకడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునిల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, పార్లమెంటు ప్రభారి కొప్పు బాష, పార్లమెంటు ప్రోగ్రాం సహ ఇన్చార్జి రావుల రాంనాథ్, దళిత మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, రాష్ట్ర నాయకులు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ ప్రభారి అర్యుల్ల పోచం, తంగెడ రాజేశ్వర్ రావు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్ యాదవ్, పోల్సాని సంపత్ రావు క్యాతం వెంకటరమణ, మున్సిపల్ అధ్యక్షుడు రాజగోపాల్, ఎర్రోళ్ళ శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలానికి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఆదివారం పెద్దపల్లి మండలానికి చేరుకోగా నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో స్వాగతం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునిల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి రంగాపూర్ , రాఘవపూర్ గ్రామాల మీదుగా పెద్దపల్లికి చేరుకోగా బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, పార్లమెంటు ప్రోగ్రాం సహ ఇన్చార్జి రావుల రాంనాథ్, దళిత మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, రాష్ట్ర నాయకులు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ ప్రభారి అర్యుల్ల పోచం ,తంగెడ రాజేశ్వర్ రావు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్ యాదవ్, పోల్సాని సంపత్ రావు, క్యాతం వెంకటరమణ, పెద్దపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్, ఎర్రోళ్ళ శ్రీకాంత్, మహంత కృష్ణ, సతీష్, ఉప్పు కిరణ్, తదిత రులు పాల్గొన్నారు.

మంథని: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి పరుషోత్తం రూపాలాకుపెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పోతరవేని క్రాంతి కుమార్ ఆదివారం వినతి పత్రం అందజేశారు. పెద్దపల్లికి వచ్చిన కేంద్ర మంత్రి రూపాలను పెద్దపల్లి జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మంథని అధ్యక్షుడు, డైరెక్టర్ పోతరవేని క్రాంతి కుమార్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా మత్స్యకా రులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ బకాయిలు, మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడం కోసం కొత్త స్కీమ్‌ల అమలు చేయాలని కోరారు.


సచ్చితం గ్రామం వద్ద కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎండుతున్న పొలాలు

- సాగు నీరు అందక ఎండుతున్న పంటలు
- వారబందీ నీటి విడుదలలో జాప్యం
- ఆందోళనలో అన్నదాతలు


ధర్మారంలో ఎండిన వరి పంట

ధర్మారం, ఫిబ్రవరి 24: యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు సాగునీరు అందక ఎండుతున్నాయి. వారబందీ నీటి విడుదలలో అధికారులు జాప్యం చేయడంతో పొలాలకు నీరు అందడం లేదు. మరో వైపు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో పంట చేతికి అందేనా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధర్మారం మండలంలో సాగు నీరందక పంటలు ఎండుతున్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద వేసిన పంట లకు సాగు సక్రమంగా నీరు చేరక ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ కాలువ ద్వారా సమయాల ప్రకారం(వారబంధీ)నీటిని విడుదలలో జాప్యం కావడంతో పంటలు ఎండిపోయాయి. మండలంలో ఎస్సారెస్పీ కాలువ నీటిపై ఆధార పడి పంటలను సాగు చేసుకున్న రైతుల ఆయకట్టుకు నీరు అందకపోవడంతో ప్రస్తుతం ఆ పంటలు ఎండిపోతుండడంతో ఆందళన చెందుతున్నారు. డి 83/బి కాలువ ద్వారా ఆధారపడి ధర్మారం, వెల్గటూర్ మండలాల్లో వరి పంటలను సాగు చేశారు. కానీ నీటి విడుదల విషయంలో పది రోజుల అవుతున్న చుక్క నీరు లేక పోవడంతో పంటలన్ని నెర్ర వాస్తున్నాయి. ప్రస్తుతం ఎండ తీవ్రతతో పంటలు పూర్తిగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. సకాలంలో ఎస్సారెస్పీ కాలువ నీటిని విడుదల చేయకుంటే తాము వేసిన పంటలు ఎండిపోయి నష్టం వాటిల్లే విదంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మొదటి దశలోనే పంటలు ఈ విదంగా ఎండిపోతుండడంతో రాబోయే రోజుల్లో ఎలా సాగు నీరు అందుతుందని ఆవేదన చెందుతున్నారు. పంటలు ఎండిపోకుండ వారబందీ నీటిని సకాలంలో అందించేలా చర్యలు తసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జూలపల్లి. మండలంలోని పెద్దాపూర్ పెద్ద చెరువులో నీటి నిలువలు రోజురోజుకు ఘననీయంగా తగ్గిపోతు కనిపిస్తుండడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. జూలపల్లి మండలంతో పాటు ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతులకు గత ఎన్నో యేళ్లుగా హుసేమినియావాగు ఆయకట్టు రైతులకు జీవన ఆదరంగా వేల ఎకరాల భూములకు సాగునీటిని అందిస్తూ వరప్రదాయనిగా విరాజిల్లుతున్నా పెద్దాపూర్ పెద్దచెరువులో ఎండల తీవ్రతకు సాగు నీటి నిలువలు తగ్గిపో తుండడంతో ఆయకట్టు రైతులు సాగునీటి లభ్యతపై ఆందోళన చెందుతు న్నారు. పెద్దచెరువు క్రింద వరి పంటలకు సరిగా సాగు నీల్లు అందకపోవడంతో సాగుచేసిన వరి పంటలు ఎండిపోయి బీటలువారుతున్నాయని, పంటలు ఎండిపోయి నష్టం కాకముందే ప్రభుత్వ ఉన్నతాదికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి పెద్దాపూర్ పెద్ద చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపాలని ఆ గ్రామానికి చెందిన సంకెండ్ల లక్ష్మీనర్సయ్య, శాంతన్‌రెడ్డి కోరుతున్నారు.


జూలపల్లి మండలం పెద్దాపూర్ అడుగంటుతున్న పెద్ద చెరువు

పోలీస్‌స్టేషన్‌కు చేరిన హుండీలు

పాలకుర్తి, ఫిబ్రవరి 25: పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లి గ్రామంలో జరిగిన సమ్మక్క-సారలమ్మల జాతరకు సంబంధించిన నాలుగు హుండీలను కొన్ని కారణాల వల్ల ఆదివారం లెక్కింపు చేయలేక పోయా మని జాతర గద్దెల వద్ద హుండీలకు రక్షణ లేకపోవడంతో ఉన్నతాధి కారుల సూచన మేరకు హుండీలను బసంత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరి చామని దేవాదాయ శాఖ డివిజన్ ఇన్స్పెక్టర్ ఆర్ సుజాత, ఈవో కె కాంతా రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కె రత్నాకర్‌లు తెలిపారు. హుండీల లెక్కింపు విషయంలో ఈసాల తక్కళ్ళపల్లి, రామరావు పల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులకు సయోధ్య కుదరకపోవడంతో లెక్కింపును వాయిదా వేసిన దేవాదాయ శాఖ అధికారులు ఇక్కడ భద్రపరి చారని బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల జాతర



బోనాలతో గౌడ సంఘ సభ్యులు, మహిళలు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25 :కోరుట్ల మండలంలోని నాగుల పేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మకు బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ దేవాయలంలో పోతరాజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట మహిళలు, సంఘ సభ్యులు గ్రామంలో బోనాల శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పోతరా జులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహి ళలు రేణుక ఎల్లమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకొని వన భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నేతలు పాల్గొన్నారు.

పూర్తయ్యేదెన్నడు?

- నారాయణపూర్ రిజర్వాయర్‌ను పట్టించుకోని ప్రభుత్వాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని కాలువల పనులు

గంగాధర, ఫిబ్రవరి 25: మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కాలువల పనులు ఏళ్లు గడిచినా పూర్తి కాలేదు. ఈ రిజర్వాయర్ పనులు 19 ఏళ్ల క్రితం ప్రారంభించారు. పనులు పూర్తి చేస్తే ఎడమ, కుడి కాలవల ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ఉప కాలువలతో గొలుసుకట్టు చెరువులు నింపవచ్చు. పదేళ్ల క్రితం ఎడమ కాలువ పనులు 90 శాతం పూర్తయ్యాయి. గత ప్రభుత్వం 10 శాతం పనులను పెండింగ్‌లో పెట్టింది. ఎడమ కాలువ లింకు డి1 కాలువకు సిమెంటు చేయలేదు. రెండేళ్ల క్రితం కుడికాలువ పనులను ప్రారంభించగా నత్తనడకన సాగుతున్నాయి. కరీంనగర్, జగిత్యాల ప్రధాన రహదారిపై కాలువ పెండింగ్‌లో ఉంది. వేములవాడ దారిలో వంతెన పూర్తయినా చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. ప్రధాన రహదారి నుంచి వేములవాడ వరకు పలువురి ఇళ్లు కాలువలో పోతున్నాయి. వాటికి పరిహారం అందించి పనులు చేయడంలో జాప్యం జరుగుతోంది. కుడికాలువకు 20 ఏళ్ల క్రితం భూముచ్చిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. కుడికాలువ పూర్తయితే గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాలకు సాగునీటితో పాటు తాగునీటి ఇబ్బందులు తొలుగుతాయి. కొత్త ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలని కోరుతున్నారు.

● మరమ్మతులు కరువు

ఎడమ కాలువ ద్వారా కొంతప్రాంతానికి సాగునీరు అందిస్తున్నారు. డి1 కాలువ సిమెంటు పనులు నాణ్యత లోపంతో పగుళ్లబారియి. పగుళ్ల ఉన్న ప్రాంత్రంలో నీరు వృథాగా పోతోంది. 20 కిలోమీటర్ల మేర ఉన్న కాలువ గోడలకు పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లు పెరిగి సిమెంటు రాలిపోతోంది. నీటిపారుదల శాఖ అధికారులు ఈ కాలువను పట్టించుకున్న పాపాన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిజర్వాయర్, కాలువ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరిందించాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో కొట్టుకొచ్చిన చెత్త



లక్ష్మీదేవిపల్లి కాలువపై దారికి పైపులు వేసిన రైతులు



పగిలిన డి1 కాలువ గోడ

పోగొట్టుకున్న బంగారం మహిళకు అప్పగింత

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 25: పోగొట్టుకున్న బంగారం తిరిగి సదరు మహిళకు అప్పగించి ఓ మహిళ ఉదారత చాటుకుంది. కాగజ్‌నగర్‌కు చెందిన కొమరోజు కమల ఈనెల 23న తుర్కల మద్దికుంట సమ్మక్క సారలమ్మ జాత రకు వచ్చింది. జాతర తన రెండు తులాల బంగారం, 3వేల రూపాయలు నగదు పోగొట్టుకుంది. మద్దికుంట గ్రామానికి చెందిన చల్లోజు కవితకు దొరికింది, కవిత పోలీసులను ఆశ్రయించడంతో ఆమె ఆ చూకీ తెలుసుకుని ఆదివారం సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మన్ రావు ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు బంగారం అప్పగించిన కవితను అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 25: ప్రస్తుతం పిల్లలు ఎత్తుకెళ్లే గ్యాంగ్ తిరుగుతుందని సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుండటంతో గ్రామంలో ఎవరు కొత్తగా కనపడిన వారిపై గ్రామస్థులు అనుమానంతో దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట గ్రామంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి సంచరిస్తుండటంతో పిల్లలు ఎత్తుకెళ్లే వారే అనుకొని గ్రామస్థులు అతన్ని మందలించారు. సమాధానం ఏం చెప్పకపోవడంతో పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


మధునమ్మ (ఫైల్)

ఇల్లందకుంట, ఫిబ్రవరి 25: మండలంలోని లక్ష్మాజిపల్లెకు చెందిన కేదూరి మధునమ్మ (70) అనే వృద్ధురాలు బావిలో దూకి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునమ్మకు కొద్ది రోజులుగా కడుపు నొప్పి ఉండగా, ఎన్ని మందులు వాడినప్పటికి నొప్పి తగ్గలేదు. శనివారం రాత్రి ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మధునమ్మ కుమారుడు సదానందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 25: మండలంలోని కల్వచర్లలో ఆదివారం కుక్కల దాడుల్లో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌లో యేసు(3), పాతబస్తీలోని కాటమోక్షిత్‌గౌడ్(4), కొట్టే వాడలోని కొలిపాక శాన్విక(4) పై కుక్కలు దాడి చేయాయి. ఈ దాడిలో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన చిన్నారులను తల్లిదండ్రులు కరీంనగర్, గోదావరిఖని ఆస్పత్రులకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 25: దిగువ కొండగట్టులో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం బొమ్మెనకు చెందిన భారతల రాము(35) అనే యువకుడు కొన్నాళ్లుగా అప్పుల బాధ, ఉద్యోగం కోసం ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 23న ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రాము ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఈ క్రమంలో కొండగట్టు వద్ద చెట్టుకు వేలాడుతున్న ఓ మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆ మృతదేహాన్ని రాముదిగా గుర్తించారు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాము కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

● నాగంపేటలో వృద్ధుడు..

గంభీరావుపేట, ఫిబ్రవరి 25: మండలంలోని నాగంపేట గ్రామానికి చెందిన అంకం బాలయ్య (75) అనే వృద్ధుడు అనారోగ్య కారణాలతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య కొంత కాలంగా అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లోని వారందరూ ఓ శుభకార్యం నిమిత్తం వెళ్లారు. ఎవరూ లేని సమయంలో ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. బాలయ్య కుమారుడు బాలరాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

రూ. 30 వేలు, కారు చోరీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట పరిధిలోని శ్రీనివాస ట్రేడర్స్‌లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు ముందుగా సీసీ కెమెరాల కనెక్షన్ తొలగించి లోనికి వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న 30 వేల నగదు దొంగిలించి చిరిగిన నోట్లను వదిలేశారు. ఆ తర్వాత కౌంటర్‌లో ఉన్న తాళం చెవిని తీసుకొని షెడ్డులో పార్క్‌చేసి ఉన్న కారును ఎత్తుకెళ్లారు. వీటితోపాటు సీసీకెమెరాల దృశ్యాలను రికార్డుచేసే డీవీఆర్‌ను తీసుకెళ్లారు. దుకాణం తెరిచేందుకు నిర్వాహకులు సంజీవరావు, శంకర్ ఉదయం వచ్చే సరికి కారు కనిపించలేదు. దుకాణం తాళం పగులగొట్టి లోపల వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. కౌంటర్ లోపల చూస్తే నగదు చోరీ అయ్యిందని గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన యువకుడిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 25: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తూ పోస్టింగ్‌లు పెట్టిన నందెల్లి మహిపాల్ అనుచరుడు తాండ్ర సతీష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో రాణా సీఐ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక భూమి వివాదానికి సంబంధించిన కేసులో బీఆర్‌ఎస్ నాయకుడు, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మహిపాల్ అరెస్టు అనంతరం అతని అనుచరుడు కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన తాండ్ర సతీష్ (29) నందెల్లి మహిపాల్ అన్న యువసేన అనే వాట్సప్ గ్రూపులో రెచ్చగొట్టే వాఖ్యలు పోస్టు చేసి వైరల్ చేశాడు. ఇతరులను రెచ్చగొట్టే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినందుకు తాండ్ర సతీష్‌పై ఐపీసీ సెక్షన్ 153, 505(2), 506 కింద కేసు నమోదు చేశామని సీఐ వెంకటేష్ తెలిపారు. అనుచిత వాఖ్యలు, రెచ్చగొట్టే వాఖ్యలతో పోస్టింగ్‌లు పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు


ట్రాక్టర్ యాజమానులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ వరంగంటి రవికుమార్

జమ్మికుంట, ఫిబ్రవరి 25: ఇసుక అక్రమగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ యాజమానులకు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారని యాజమాని శ్రీనివాస్, డ్రైవర్ రవి పోలీస్ సిబ్బందిని చేతులతో నెట్టివేశారన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన శ్రీనివాస్, రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గతంలో క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులపై పీడీ యాక్ట్ పెడుతామని హెచ్చరించారు. ఇసుక అవసరం ఉన్న వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెప్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాధకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

రాయికల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో భీమేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో భీమన్న సేవా సమితి సభ్యులు నీలి రాములు, ఒజ్జల నరేందర్, సుతారి తిరుపతి, నీలి తిరుపతి, పడాల గోపి, ఒజ్జల రాజరెడ్డి, నీలి చిన్న రాములు, నీలి నరేష్, జగడం మల్లేష్, నీలి రమేష్, మున్నూరుకాపు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కులను కాలరాసిన కేసీఆర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 25: వికలాంగుల హక్కులను కేసీఆర్ ప్రభుత్వం కాలరాసిందని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య విమర్శించారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెటనే మొదటి ఉద్యోగం వికలాంగురాలు రజినీకి ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేసి వారిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటారన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజున నిర్వహించిన కార్యక్రమానికి అప్పటి సీఎం కేసీఆర్ హాజరు కాలేదని అన్నారు. వికలాంగులను ఉద్దేశించి మరుగుజ్జులు అని సంబోధించి వారి మనోభావాలను కించపరిచారని అన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోలో జిల్లాకో వికలాంగుల స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖను కేసీఆర్ మహిళ శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసి వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. వికలాంగుల వాహనాలకు ఇచ్చే రాయితీని, అంత్యోదయ కార్డులను ఎత్తివేశారన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌ల పదవుల భర్తీలో దివ్యాంగులకు కూడా అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో వికలాంగుల అభివృద్ధిపై మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వికలాంగులకు పెన్షన్లు మూడువేల నుంచి ఆరు వేల రూపాయలకు పెంచామన్నారు. కాంగ్రెస్ హయాంలో వికలాంగులకు టెలిఫోన్ బూత్‌లు కేటాయించామని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి దివ్యాంగులు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన 250 మంది వికలాంగుల విభాగం ప్రతినిధుల సమక్షంలో ఆరు తీర్మానాలు ప్రవేశ పెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, టీపీసీసీ నాయకులు రహమత్ హుస్సేన్, రామిడి రాజిరెడ్డి, కరీంనగర్ డీసీసీ సమన్వయకర్తలు మొగిలి లక్మయ్య, నందగిరి జగదీశ్వరచారి, గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల విభాగం చైర్మన్ దేశ గాని సతీష్, అబ్దుల్లా అజీజ్, కంది నాగరాజు, సంపత్ , ఏన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ వీరయ్య

జీవో 317పై మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు హర్షణీయం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 25: జీవో 317 సమస్యలపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం హర్షణీయమని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో ఆదివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ జీవో 317 ద్వారా ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫార్సు చేయడం కోసం జీవో 292 ద్వారా రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలులో భాగంగా ఉద్యోగుల శాశ్వత కేటాయింపు కోసం గత ప్రభుత్వం 2021 డిసెంబరు 6న ఏకపక్షంగా జీవో 317ను విడుదల చేసిందని విమర్శించారు. ఈ జీవో ద్వారా పలువురు ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. కేడర్‌లో జూనియర్ అయినందుకే సొంత జిల్లాలను వదిలి పక్క జిల్లాలకు వెళ్లారని, భార్యభర్తలను కూడా వేరు చేయడం జరిగిందని అన్నారు. నిబంధనల ప్రకారం భార్యభర్తలను ఒకే జిల్లాకు బదిలీ చేయాల్సి ఉండగా 19 జిల్లాలో అనుమతించి 13 జిల్లాలను బ్లాక్ చేశారన్నారు. స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగాల కోసం విడిపోయిన భార్యభర్తలకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించగా అధికారంలోకి వస్తే జీవో 317పై పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశాల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా కార్యదర్శి అంబటి రమేష్, లత, పరకాల రవీందర్, వంగ మల్లేశం, శివకుమార్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రాంనాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పూరెల్లి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, దెబ్బడ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట్ ఉత్సవం


పార్వేట్ ఉత్సవంలో భాగంగా చిరుతపులిని వేటాడుతున్న అర్చకులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వేట్ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి వారు అటవీ ప్రాంతానికి పర్యటనకు వెళ్లగా, అక్కడ లక్ష్మీదేవికి చిరుత కనిపించడంతో దానిని వేటాడాలని స్వామివారిని కోరుతుంది. ఈ సన్నివేశాన్ని అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య చిరుతను వేటాడే సన్నివేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావ్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎనగంటి సామ్రాట్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు పెద్ద సంతోష్, మధు, చిన్న సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మతల్లి పండగ


అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూంల సముదాయంలో ఆదివారం మైసమ్మతల్లి పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మైసమ్మతల్లికి పట్నాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాలనీవాసులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవాలు


స్తంభంపల్లిలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం


బుగ్గారంలో రథోత్సవంలో పాల్గొన్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ఫిబ్రవరి 26: మండలంలోని స్తంభంపల్లిలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం మాఘమాసంలో వచ్చే పౌర్ణమి మరుసటి రోజు రథోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి ఉత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కోర మీసాలు, పట్టె నామాలు సమర్పించుకున్నారు.

● బుగ్గారం: మండల కేంద్రంలో శ్రీ ముత్యాల-నల్ల పోచమ్మ రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి మరుసటి రోజు రథోత్సవాన్ని నిర్వహించారు. ఒగ్గు కళాకారులు, డప్పు చప్పుళ్ల మధ్య భక్తులు నాట్యాలు చేస్తూ పోచమ్మ ఆలయం చుట్టూ ఐదు సార్లు రథాన్ని తిప్పారు. వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నర్సాగౌడ్ పాల్గొన్నారు.

● కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. మొక్కులు చెల్లించుకున్న భక్తులు వైభవంగా సాగిన రథోత్సవాన్ని వీక్షించారు. పండితులు రథారదన, రథహోమం, రథ బలిహరణం అనంతరం గ్రామంలో రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడీల గంగప్రసాద్, కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


తాండ్ర్యాలలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

నల్లగొండలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని నల్లగొండ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ ఆదివారం సెలవు రోజు కావడంతో ఎగువ, దిగువ ఆలయాల్లో స్వామి వారిని వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: పట్టణంలో శాంతినగర్‌లో అద్దెకు ఉంటున్న ఇంటికే కన్నం వేసిన వరంగల్ జిల్లా అబ్బనికుంటకు చెందిన అనుముల రాజేంద్రప్రసాద్(35)ను ఆదివారం పెద్దబజార్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ నెల 13న సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అడ్డగట్ల అరవింద్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగుల గొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలోని బంగారు గొలుసు, కమ్మలు, రెండు రింగులు, 15 తులాల వెండి, 40 వేల నగదు ఎత్తుకెళ్లా డు. రాజేంద్రప్రసాద్ ఫిర్యాదుతో విచారణ చేపట్టామని, రాజేంద్రప్రసాద్ వద్ద బంగారు, వెండి ఆభరణాలు స్వాధీ నం చేసుకొని కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

కొడుకు పెళ్లి కావడం లేదని మహిళ ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 25: కొడుకు పెళ్లికావడం లేదని సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన చిప్ప శారద (48) ఆదివారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన శారద కొడుకుకు వివాహం కావడం లేదని నిత్యం బాధపడేది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫైపునకు చీరతో ఉరేసుకుంది. కొడుకు పెళ్లి కావడంలేదనే మనస్తాపంతో తన భార్య ఆత్మహత్య చేసుకుందని భర్త దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రాలు చేస్తోందని మహిళపై దాడి

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: తన కూతురుకు మంత్రాలు చేశారనే నెపంతో మహిళ ఇంటిపై దాడి చేసిన ఘటనలో ఒకరిపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన సంకటాల జలపతి అనే వ్యక్తి తన కూతురుకు మంత్రాలు చేశాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన పోరెడి అమృత ఇంటిపై ఆదివారం దాడి చేసి దుర్భాషలాడాడు. అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తండ్రిపై దాడి చేసిన కుమారుడిపై కేసు

బీర్‌పూర్, ఫిబ్రవరి 25: తండ్రిపై దాడి చేసిన కుమారుడిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని నర్సింహుల పల్లికి ఆడెపు చంద్రయ్యపై అతడి చిన్న కుమారుడు ఆడెపు సత్తయ్య కర్రతో దాడి చేశాడు. దీంతో చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 25: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ముదిగంటి రఘుపతి (39) అనే వ్యక్తి కరీంనగర్ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ ఉపేంద్రాచారి కథనం మేరకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన ముదిగంటి రఘుపతి (39) కుటుంబంతో కలిసి చొప్పదండిలోని పడకంటి కృష్ణ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి యజమాని కృష్ణ వద్ద రఘుపతి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు చెల్లించమని కృష్ణ వేధించాడని ఈనెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రఘుపతి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంభీర్‌పూర్‌లో ఎరువుల దుకాణం సీజ్

కథలాపూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని గంభీర్‌పూర్‌లో మహేంద్ర ఎరువుల, పురుగు మందుల దుకాణాన్ని ఆదివారం సీజ్ చేసినట్టు ఏవో యోగిత తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గంభీర్‌పూర్ వెళ్లి దుకాణాన్ని పరిశీలించగా లైసెన్స్ గడువు మీరినప్పటికీ ఎరువులు విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించలేదని తేలిందన్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఏడీఏకు సిఫార్సు చేశామన్నారు. రైతులు డీలర్ వద్ద తీసుకునే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు పొందాలని సూచించారు.

వృద్ధులకు మెరుగైన వసతులు కల్పించాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 23: వృద్ధులకు మెరుగైన వసతులు కల్పించాలని పర్సన్స్ విత్ డిసేబులిటీస్, సీనియర్ సిటిజన్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ ట్రాన్స్ జెండర్స్ శాఖ కమిషనర్ బి శైలజ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని వయో వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని గదులను పరిశీలించి ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను చూసి అభినందించారు. వృద్ధులకు అందుతున్న వసతులు తదితర అంశాలపై ఆరా తీశారు. వృద్ధులకు నిత్యం గుడ్లు, అరటి పండ్లు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. వారికి ఆస్తి, కుటుంబ సంభందిత వివాదాలు ఉంటే సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిరాజం, సిబ్బంది పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్ కాలువల పనులను పూర్తి చేయాలి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 25: మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వేములవాడలో అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిడ్ మానేరు నుంచి అప్పర్ మానేరు వరకు నీరందించే ప్యాకేజీ-9కి సంబంధించి పనుల పురోగతిపై తెలుసుకున్నారు. సింగసముద్రం చెరువు నుంచి అప్పర్ మానేరు ప్రాజెక్టు వరకు బ్యాలెన్స్ పనులు, మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తయ్యేందుకు కావాల్సిన నిధుల విడుదలపై ముఖ్యమంత్రితో చర్చించడానికి అవసరమైన నివేదికలను పరిశీలించారు. బ్యాలెన్స్ పనులను పూర్తి చేస్తే తక్షణమే 20 వేల నుంచి 30 వేల ఎకరాల వరకు ఆయకట్టుకు సాగు నీరు అందించవచ్చన్నారు. నిమ్మపల్లి నుంచి వేములవాడ వరకు మూలవాగుపై నిర్మించిన చెక్ డ్యాములు వరదల కారణంతో దెబ్బతిని పొలాలు కోతకు గురయ్యాయని, భవిష్యత్‌లో మరోసారి రైతుకు నష్టం జరగకుండా మరమ్మతులు చేయాలని సూచించారు. దెబ్బతిన్న పొలాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు కావాల్సిన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మల్లారం ఆనకట్ట నుంచి గుడి చెరువుకు వచ్చే కట్టు కాలువతో బుడగజంగాల కాలనీ ముంపునకు గురవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కాలువలో పూడికతీయడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద మూలవాగులో కలిసే విధంగా బుడగ జంగాల కాలనీ వద్ద నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో మురికి కాలువలు గుడి చెరువులో కలవకుండా మూలవాగు వరకు కాలువలు నిర్మించేందుకు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించాలని, అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బాల్కొండ డివిజన్ పరిధిలో ఉన్న రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ తూమును, రెండు కిలోమీటర్ల కాలువని ఈ జిల్లా పరిధిలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి అప్పగించాలన్నారు. నీటి నిర్వహణ సులభంగా మారి ఎగువన ఉన్న బాల్కొండ నియోజకవర్గంలోని కోనాపూర్ గ్రామ ఆయకట్టుకి నీటిని అందించే బాధ్యతతోపాటు, వేములవాడ నియోజకవర్గంలోని భూషణ్‌రావుపేట్, ఊటపల్లి, చింతకుంట, కథలాపూర్ రైతులకు సాగునీరు అందించడం కోసం ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాయాలని సూచించారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో కోతకు గురైన చెరువుల మరమ్మతుకు సంబంధించి వివిధ స్థాయిలో అంచనాలను త్వరగా ఆమోదించాలని, వచ్చే వర్షాకాలంలోపు చెరువుల మరమ్మతు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శివకుమార్, ఈఈలు శ్రీనివాసరెడ్డి, అమరేందర్ రెడ్డి, డీఈలు ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్, రవికుమార్, సత్యనారాయణ, వినోద్ కుమార్, క్రాంతికుమార్, సురేశ్, కిషోర్, ఏఈలు నవీన్ కుమార్, శ్రీనివాస్, సాగర్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నిధుల మంజూరుపై హర్షం

- ముఖ్యమంత్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 25: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.126కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి మాట్లాడారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో రామగుండం బీఆర్ఎస్ నాయకులు నిర్వీర్యం చేశారని, కేవలం పేపర్ ప్రకటనలు ఇస్తూ అంకెల గారడీ చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.126కోట్లను తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కే దక్కిందన్నారు. ఎన్నికల్లో మక్కాన్‌సింగ్ గెలిస్తే ఏమి చేయడని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రచారం చేశారని, కానీ గెలిచిన తరువాత రామగుండం అభివృద్ధి ధ్యేయంగా మక్కాన్‌సింగ్ అహర్నిషలు కష్టపడుతున్నారన్నారు. ఏడాది కాలంలో రామగుండం రూపురేఖలను మారుస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, నాయకులు పాతిపెల్లి రవి, పెండ్యాల మహేష్, బొమ్మక రాజేష్, సుతారి లక్ష్మణ్‌బాబు, చుక్కల శ్రీనివాస్, దాసరి ఉమసాంబమూర్తి, ఫజల్‌బేగ్, దూళికట్ట సతీష్, గట్ల రమేష్, నాజీమ్, గుంపుల తిరుపతి, ఆడెపు రవి, చెరుకు శంకర్, మాలెం మధు, మారెంగుల రమేష్, శ్యాంసుందరచారి పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మక్కాన్‌సింగ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రుద్రంగి, ఫిబ్రవరి 25: రుద్రంగి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 25: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని కాంగ్రెస్ బూత్ కమిటీలను బలోపేతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు.

జీవోల జారీ అభినందనీయం

- కాంగ్రెస్ పార్టీశ్రేణుల హర్షం
- శ్రీపాదరావు జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం

మంథని, ఫిబ్రవరి 25: మాజీ శాసన సభా స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తండ్రి స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంథని పట్టణ శివారులోని గోదావరినది పై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 125 కోట్లు మంజూరు చేస్తూ సైతం ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. మంత్రి శ్రీధర్‌బాబు కృషితో మంథని ప్రాంతానికి సంబంధించిన రెండు కీలక మైన జీవోలను రాష్ట్ర ప్రభుత్వం శనివారం జారీ చేసింది. దీంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీపాదరావు జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర పండగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేయడం శ్రీపాదరావు చేసిన ప్రజాసేవకు అరుదైన గౌరవంగా మంథని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భావిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించడానికి, నేషనల్, స్టేట్ హైవేలకు లింక్ చేస్తూ ప్రజలకు రవాణా వ్యవస్థను మెరుగు పర్చడానికి, దూరం భారాన్ని తగ్గించడానికి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మంథని సమీపంలోని గోదావరినది పై అవతి వైపు ఉన్న మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు వంతెనను నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మంథని ప్రాంత అభివృద్ధికి, ప్రజా రవాణాకు కీలక మైన బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు రూ. 125 కోట్లు మంజూరు చేయించడంపై కాంగ్రెస్ పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంథని ప్రాంత అభివృద్ధికి శ్రీధర్‌బాబు కృషి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్

మంథని, ఫిబ్రవరి 25: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తన ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తూ.. మంథని ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ అధిక మొత్తం నిధులు మంజూరు చేయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు హయాంలో మంథని అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తారని, భవిష్యత్తు కాలంలో అభివృద్ధికి మంథని ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఎన్నికల్లో గెలిచాక 80 రోజుల్లోనే మంథని నియోజకవర్గాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధి బాట పట్టించారన్నారు. అసాధ్యం అనుకున్న మంథని సమీపంలో గోదావరి నది పై వంతెన సుసాధ్యం చేసిన ఘనత శ్రీధర్ బాబుకి దక్కుతుందన్నారు. రూ. 125 కోట్లతో మంథని గోదావరి తీరం నుండి శివ్వారం వరకు బ్రిడ్జి నిర్మాణం తీసుకొచ్చి, మంథని అభివృద్ధికి శ్రీధర్ బాబు పునాదులు వేశారన్నారు. పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారి నిర్మాణం, మంథనిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఎన్నికల్లో పేర్కొన్న హామీలే కాకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వంలోని సాధ్యమవుతాయన్నారు. నూతనంగా నిర్మాణం చేపట్టబోయే బ్రిడ్జికి శ్రీపాద వారధి అని నామకరణం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించి మార్చి 2న ఆయన పుట్టినరోజు పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపడం చాలా ఆనందకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు పోలు శివ, పెంద్రు రమా-సురేష్ రెడ్డి, బూడిద శంకర్, ఎరుకల ప్రవీణ్, మంథని సత్యం, నూకల బానయ్య, కూడుదల వెంకన్న, జనగామ నర్సింగరావు, కొత్త శ్రీనివాస్, ముస్కుల సురేందర్ రెడ్డి, మంథని సురేష్, ఎల్లంకి వంశీ, గుండా రాజు, ఊరకొండ గణేష్, సింగారపు కిష్టయ్య, మద్దెల రాజయ్య, ఎజాజ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పెద్దపల్లిలో కేక్ పంచుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 25: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దపల్లి పట్టణంలో వేర్వేరుగా ఘనంగా జరిపారు. పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, రేవల్లి స్వామి బెక్కం (ప్రశాంత్) అంజమ్మ, కనుకుర్తి కార్తీక్, కోఆప్షన్ సభ్యులు ఫాహీమ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వైద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్ఫూర్తి మానసిక దివ్యాంగుల కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, నాయకులు బండారి శ్రీనివాస్, కొయ్యడ సతీష్, ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తీగల సదయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నేతలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, తాల్లపల్లి మనోజ్‌గౌడ్, పాల రామారావు, రాజమల్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఎంపీపీ నూనేటి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జూకంటి శిరీషఅనీల్, ఎంపీటీసీ జెట్టి దేవయ్య, గడ్డం రామచంద్రం, నాయకులు సుముఖం మల్లారెడ్డి, నిదానపురం దేవయ్య, మాదాసు చందు, కదురు సతీష్, ఒడ్నాల శ్రీనివాస్, జిన్న రామచంద్రంరెడ్డి, సారంగపాణి, తిరుపతి, సదానందం పాల్గొన్నారు.

ఓదెల: మల్లన్న ఆలయంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీపీ రేణుకాదేవి, ఆళ్ళ రాజిరెడ్డి, నల్ల రమణారెడ్డి, చింతం వెంకటస్వామి, మ్యాడగోని శ్రీకాంత్, సుధాకర్, చింతం మొగిలి, కర్రె కుమార్, బోడకుంట నరేష్, పోలోజు రమేష్, గుండేటి మధు, బుద్ధి పోశెట్టి, తీర్థాల కుమార్, దేవిలాల్, తెలుసురి కొమరయ్య, మార్క రవి తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్ తదితర గ్రామాల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెద్దాపూర్ గ్రామంలో పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మీనర్సయ్య గ్రామస్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి కృష్ణమూర్తి, కల్లెపెల్లి లింగయ్య, తొగరి శ్రీనివాస్, స్వామి, అంజయ్య, కిషన్,లచ్చయ్య, శంకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదినవేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు తానిపర్తి మోహన్‌రావు, న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, మండిగ రాయనర్సు, కొండల్‌రెడ్డి, సతీష్, ప్రవీణ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వార సంత

- ఇబ్బందుల్లో వ్యాపారులు



వారంతపు సంతలో రూఫ్‌లేని దిమ్మెలు

రామగిరి, ఫిబ్రవరి 25: మండలంలోని సెంటినరీకాలనీ వారసంత సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పారిశ్రామిక ప్రాంత సెంటినరీకాలనీలో ప్రతి బుధవారం పెద్దఎత్తున వార సంత కొనసాగుతుంది. మండలంలోని పలు గ్రామాలతో పాటు ముత్తారం, 8ఇంక్లైన్‌కాలనీ, గోదావరిఖని, మంథని ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కూరగాయలు, ఇతర వస్తువుల అమ్మకాలకు వ్యాపార కేంద్రంగా కొనసాగుతోంది. వార సంతలో విక్రయదారులకు కూరగాయలు పెట్టుకునేందుకు వీలుగా దిమ్మెలను ఏర్పాటు చేసి వదిలివేశారు. దిమ్మెల నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనల మేరకు సింగరేణి స్పందించి ఏర్పాటు చేసింది. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న వార సంతలో వ్యాపారులకు నిలువ నీడ లేని పరిస్థితి నెలకొంది. ప్రతి బుధవారం దిమ్మెలపై టార్పాలిన్ కవర్‌లతో విక్రయాలను కొనసాగిస్తున్నారు. సంతలో ఏర్పాటు చేసిన దిమ్మెలపై ఎలాంటి పైకప్పు లేని కారణంగా ప్రతి సీజన్‌లో వ్యాపారులు ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి, వర్షాకాలాల్లో వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మార్కెట్‌పై ఆదాయం పొందుతున్న గ్రామపంచాయతీ సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో సింగరేణి సంత అభివృద్ధిపై తత్సారం చేస్తుండగా... గ్రామపంచాయతీ నిధులు అంత పెద్దమొత్తంలో కల్పించడం కష్టంగా భావిస్తోంది. వెరసి సంత అభివృద్ధి పనులపై నీలినీడలు అలుముకుంటున్నాయి. వ్యాపార సంస్థలకు సంబంధించిన బాత్‌రూంల నుంచి వచ్చే మురుగు నీరు నేరుగా సంతలోకి చేరి దుర్గంధం వెదజల్లుతుండడంతో వ్యాపారస్తులు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ యార్డుకు ప్రహరీ లేని కారణంగా పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా వార సంతలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

పాలకుర్తి, ఫిబ్రవరి 25: మండలంలోని కుక్కల గుడూరు గ్రామానికి చెందిన కట్కూరి చంద్రమ్మకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆదివారం సింగిల్ విండో చైర్మన్ మనోహర్‌రెడ్డి రూ.5000లతో పాటు 15 సిమెంట్ బస్తాలను వితరణ చేయగా నాయకులు వారి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పోచన్న, భూమన్నలకు ఘన నివాళులు

అంతర్గాం, ఫిబ్రవరి 25: రామగుండం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కత్తెరమల్ల పోచన్న, ఆరుముళ్ల భూమన్నల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచన్న, భూమన్నల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మేరుగ చంద్రయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఐ కృష్ణ, ఈదునూరి నరేష్, కొల్లూరి మల్లేష్, బొంతు ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం

వేములవాడ, ఫిబ్రవరి 25: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర క్షేత్ర ఆర్య వైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం ఆధ్వర్యంలో ఆధునీకీకరించిన వాసవి కల్యాణ మండపం భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే యాత్రికుల కోసం ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాలతో వసతి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సత్రం నిర్వాహకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్లు, కల్వర్టులు

- తరచూ ప్రమాదాలు - పట్టించుకోని అధికారులు



మండల పరిషత్ కార్యాలయం దారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



కంకర తేలి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ధర్మారం, ఫిబ్రవరి 25: ధర్మారం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే(మార్కెట్ యార్డు ఎదురుగా) టర్నింగ్‌లో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ధర్మారం మండల కేంద్రంలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణాలకు గత ప్రభుత్వ హాయంలో రూ. 3కోట్ల 50లక్షల నిధులు మంజూరు కాగా పనులు చేశారు. విస్తరణలో బాగంగా ఇరువైపుల డ్రైనేజీలను నిర్మించారు. అయితే మార్కెట్ యార్డు ఎదురుగా నుంచి మండల పరిషత్ కార్యాలయంకు వెళ్లే టర్నింగ్ కల్వర్టుకు రెండు వరుసలతొ పైపులైన్ వేశారు. ఇటు వైపు నుంచి డ్రైనేజీని నిర్మించి పూర్తి స్థాయిలో పై కప్పు నిర్మించలేదు.

దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనాదారులు ముందు గమనించకుండ తారు రోడ్డుపై వెళ్తుండడంతో ప్రమాదానికి గురి అవుతున్నారు. ధర్మారంలోని ప్రధాన చౌరస్తా నుంచి సాయిమణికంఠ పాఠశాల వరకు ఇరువైపుల డ్రైనేజీలను నిర్మించి రెండు ప్రదేశాల్లో మురుగు నీరు అటు వైపు వెళ్లే విధంగా ఒకచోట పైపులు వేసి, మరో చోట ఎంపీపీ టర్నింగ్‌లో పూర్తి స్థాయిలో స్లాబ్ వరకు డ్రైనేజి నిర్మించి దీనిపై పై కప్పు వేయకుండ వదిలేయడంతో పెద్ద సమస్యగా మారింది. డ్రైనేజీ , రోడ్డు విస్తరణ పనులు తూతూ మంత్రంగా కాంట్రాక్టర్ చేసి చేతులు దులుపుకున్నారు. మండల పరిషత్ కార్యాయంకు వెళ్లే టర్నింగ్ ద్వారా జిల్లా ఉన్నతధికారులు, మంత్రులు, మండల అధికారులు. నాయకులు, ఇతరతర వాహానాలు ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటాయి. కానీ ఇక్కడ ప్రమాదకరంగా ఉందన్న విషయం తెలియక ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోంది. ఇక్కడ ఏర్పడిన సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ప్రమాదాల నివారణలో బాగంగా మురుగు నీటి ప్రవాహం కోసం నిర్మించిన స్లాబ్ వరకు అటు,ఇటు డ్రైనేజీలపై పూర్తి స్థాయలో పై కప్పు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



పుట్నూర్‌లో పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

పాలకుర్తి, ఫిబ్రవరి 25: మండలంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. మండల పరిధిలోని పుట్నూర్ గ్రామానికి అప్పటి ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ 2018లో 19 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసి ఓ స్థానిక కాంట్రాక్టరుకు పనులను అప్పగించారు. సదరు కాంట్రాక్టరు కేవలం 10 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం నామమాత్రంగా చేపట్టి పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు పూర్తి కావడం లేదు. అప్పట్లో గ్రామంలో కురిసిన భారీ వర్షాలకు నిలువ నీడలేని 7 కుటుంబాల సభ్యులు పూర్తికాని ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అందులో కిటికీలు, దర్వాజాలు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, కనీసం తాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులను పడుతున్నారు. సోమారపు సత్యనారాయణ తర్వాత 5 ఏళ్లు ఎమ్మెల్యేగా పదవిలో కొనసాగిన కోరుకంటి చందర్ గ్రామంలో సమావేశం నిర్వహించి లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పుట్నూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎవరికి అధికారికంగా కేటాయించలేదని గ్రామ తాజా మాజీ సర్పంచ్ రావుల శారద తెలిపారు. గ్రామంలో అప్పట్లో భారీ వర్షాలకు గ్రామంలోని 7 కుటుంబాలకు చెందిన వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, దీంతో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను సంప్రదించగా తాత్కలికంగా ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉండమని వారికి సూచించారని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో స్థానిక ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పుట్నూర్‌లో పూర్తి కాని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- పూర్తి కాని ఎస్సారెస్పీ లింకు కాలువ పనులు
- లైనింగ్‌ను తొలగించడంతో అందని సాగునీరు
- చర్యలు తీసుకోని అధికారులు - రైతుల అవస్థలు



నంది రిజర్వాయర్ వద్ద తవ్విన కాలువ

ధర్మారం, ఫిబ్రవరి25: ధర్మారం మండల కేంద్రంలో గల డి83/బి కాలువకు లింకు కాలువ నిర్మాణానికి పనులు చేసి వదిలేశారు. మండలంలోని నంది రిజర్వాయర్ నుంచి ధర్మారంలోని ఎస్సారెస్పీ డి 83/బి కాలువకు లింకు కాల్వ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.12కోట్ల 40లక్షల నిధులను మంజూరుచేసింది. ఈ మేరకు కాంట్రాక్టర్ 2022 నవంబరు30న పనులను మొదలుపెట్టారు. అక్కడినుంచి వేగవంతంగా నూతన కాలువను తవ్వారు. తర్వాత పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. నందిమేడారం రిజర్వాయర్ వద్ద కాలువ నిర్మాణ పనులు చేశారు. అదేమాదిరిగానే ధర్మారం డి83/బి కాలువ వరకు నూతన కాలువను తవ్వి వదిలేశారు. అంతేకాకుండ ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి లింకు కలిపే డి83/కాలువకు ఉన్న సిమెంట్ లైనింగ్‌ను కాంట్రాక్టర్ తొలగించారు. దీంతో సకాలంలో లింకు కాలువ పనులు పూర్తవకపోవడంతొ ధర్మారం,వెల్గటూర్ మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదు. తమ పంటలకు సాగు నీరందడం లేదని రైతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్న పట్టించుకున్న వారే కరువయ్యారు. ఇటీవల నీటిపారుదల శాఖ, ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ అధికారులు కాల్వ నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కానీ ఇంత వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ఉన్నాయి. వేసవిలోనే ఎస్సారెస్పీ లింకు కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేస్తే వానాకాలం పంటకు సాగు నీరు అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వానాకాలం పంటల సాగు సమయంలోనే చేపట్టితే అటు వర్షాలు కురవడం...ఇటూ వరి నాట్లు వేసుకునే పరిస్థితి ఉంటుందని కనుక సకాలంలోనే పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైన నీటిపారుదల శాఖ, ఎస్సారెస్పీ శాఖ అధికారులు సంయుక్తంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

- ప్రయాణికుల అవస్థలు - పట్టించుకోని అధికారులు



ఐబీ చౌరస్తా వద్ద పని చేయని ట్రాఫిక్ సిగ్నల్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 25: సుల్తానాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తొలగించేందుకు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టిన సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు ఆరంభ శూరత్వంగా మిగిలిపోయింది. సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాజీవ్ రహదారి నుంచి ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రాజీవ్ రహదారి నుంచి శ్రీరాంపూర్, ఓదెల, హుజురాబాద్, పొత్కపల్లి హన్మకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు క్రాస్ చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గం నుంచి రాజీవ్ రహదారి మీదకు గోదాముల నుంచి దాన్యం, బియ్యం లారీలు, క్వారీ ల నుంచి వచ్చే భారీ వాహనాలు, పలు మండలాల నుంచి వచ్చే ఇసుక లారీలు చేరే సందర్భంలో కూడా అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన, గాయపడిన సంఘటనలు చోటు చేసకుంటున్నాయి. దాంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ చౌరస్తా తో పాటు రాజీవ్ రహదారి నుంచి రాకపోకలు సాగించే వాహనాలను క్రమబద్ధీకరించేందుకు,ప్రమాదాల నివారణకు గాను ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆప్పటి డీసీపీ ఏసీపీ తదితరులతో పాటు కమీషనర్ స్థాయి అధికారులు కూడా పరిశీలన జరిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ కు సంబంధించి పోల్స్‌ను ఏర్పాటు చేసి సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాలుగు వైపులా సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి ఒకటి రెండు రోజులు పనితీరును కూడా పర్యవేక్షించారు. కానీ ఏమైందో కానీ ఆ తర్వాత వాటి గురించి పట్టించుకున్నానాధుడు లేకుండా పోయారు. ఇంకా ప్రారంభానికి కూడా నోచుకోలేదు. రెండేళ్ల నుంచి మళ్లీ సిగ్నల్స్ ఏర్పాటు విషయంపై పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కేంద్ర పథకాలు వివరించేందుకే యాత్ర

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా

రామగిరి, ఫిబ్రవరి 25: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకే సంకల్పయాత్ర చేపడుతున్నామని మంత్రి పర్షోత్తమ్ ఖోడాభాయ్ రూపాలా అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా స్థానికంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ప్రకారం ఒకే దేశంలో ఒకే విధానం అమలు కావాలనే ఉద్దేశ్యంతో జమ్మూకాశ్మీర్‌లో ఏర్పాటు చేసిన 370, 34 ఆర్టికల్‌ను రద్దు చేసే సాహసోపేతమైన నిర్ణయం ప్రధాని తీసుకున్నారని చెప్పారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌లో కనిపిస్తోందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒకే చట్టం.. ఒకే అభివృద్ధే అన్నది బీజేపీ విధానమని తెలిపారు. సమావేశంలో ప్రదీప్‌రావు, ఎస్ కుమార్, రాముల రామ్‌నాథ్, కందుల సంధ్యరాణి, సునీల్‌రెడ్డి, మోల్మూమూరిశ్రీనివాస్, తీగల శ్రీధర్, క్రాంతి పాల్గొన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ పశుసంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తమ్ ఖోడాభాయ్ రూపాలాను ఆర్జీ-3, ఏపీఏ ఇన్‌చార్జి జీఎంలు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు రామగిరి అతిథిగృహంలో మర్యదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రఘుపతి, అధికారులు రమేశ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫ్యూరిఫయర్ అందజేత

పాలకుర్తి, ఫిబ్రవరి 25: మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాకు చెందిన ఇస్లావత్ సమ్మయ్య తన తండ్రి ఇస్లావత్ పాపయ్య నాయక్ జ్ఞాపకార్థంగా ఆదివారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వాటర్ ప్యూరిఫయర్ అందజేశారు. ప్లాంట్‌ను బసంత్‌నగర్ ఎస్సై స్వామి ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి నిత్యం వచ్చే వారికి, సిబ్బందికి ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఇస్లావత్ తిరుపతి, దరావత్ రాజేష్, ఇస్లావత్ సమ్ము, భూక్య కిషోర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.